క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజంపేట టౌన్ : రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట మండలంలోని తాళ్ళపాక, ఆకేపాడు, పట్టణంలోని సరస్వతీపురం, పెనగలూరు మండలంలోని పెనగలూరు, టీజీపల్లె, బెస్తపల్లె, పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పరిసర గ్రామాల్లో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

పెనగలూరులో..

పెనగలూరు : మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. పెనగలూరు, బెస్తపల్లి, తిమ్మాయిగారిపల్లి, కొండూరు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు రైతులు, సహకరించాలని కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె : మండలంలోని సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2023-24 సంవత్సరానికి గాను ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియం, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు అర్హత కల్గిన బాలుర దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కళావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు ఈనెల 24వ తేదీ వరకు స్వీకరించబడతాయని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఐదోతరగతికి సంబంధించి 7893655968 సంప్రదించాలని, అలాగే జూనియర్ ఇంటర్మీడియట్‌కు 9963379679 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వాహనాల తనిఖీ



వాహనలను తనిఖీ చేస్తున్న అధికారులు

సిద్దవటం : ఎమ్మెల్సీల ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించామని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ అధికారి రమేష్‌రెడ్డి, వీడియో సర్వేలెన్స్ అధికారి మానస తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటంలోని పోలీసు స్టేషన్ క్రాస్‌రోడ్డు వద్ద ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం ఇతర వస్తువులను అక్రమంగా తరలిస్తుంటారని అందుకోసం వాహనాల తనిఖీ చేపట్టమన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వీడియోగ్రాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సంబేపల్లె : రైతులు సాగు చేసిన పంటలు ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ శ్రీలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన మండల వ్యవసాయ మండలి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్ చేయించుకోవాలని పేర్కొన్నారు. దీని ద్వార రైతులకు అందవలసిన క్రాప్ ఇన్సూరెన్స్, రైతు భరోసా, మద్దతు ధర చేకూరుతాయన్నారు. పీఎం కిసాన్‌కు ఆధార్, బ్యాంక్ ఖాతాను అనుసంధానం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుట్టపల్లె సర్పంచ్ చిదంబర్‌రెడ్డి, ఏఓ రామంజులరెడ్డి, మండల వ్యవసాయ మండలి చైర్మన్ వాసుదేవ రెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలోని అయ్యలరాజుపల్లె దళితవాడలో శుక్రవారం రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ టీటీడీ నిధులతో దళితవాడలో రామాలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గడ్డె సిద్దమ్మ, జరుగు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్ నాయుడు, పిచ్చన్న, కె.శ్రీధర్, కొప్పల శేఖర, కొప్పల మణి, కొమ్మూరు శంకర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెన్నపూస, రామచంద్రారెడ్డిల విజయానికి సహకరించండి

- మొదటి ప్రాధాన్యత ఓటుతో ఇరువురిని బలపరచండి
- ప్రచారంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వైఎస్సార్‌సీపీ నేతల వినతి



రాజంపేట టౌన్: ప్రచారంలో పోలా శ్రీనివాసులురెడ్డి



పెనగలూరు: ప్రచారంలో అజయ్ రెడ్డి, విజయ్ రెడ్డి



సంబేపల్లె: ఎన్నికల ప్రచారం చేస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



రాజంపేట: ఓటును అభ్యర్థిస్తున్న నాగిరెడ్డిపల్లె సర్పంచ్



రామాపురం: ప్రచారాన్ని చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఒంటిమిట్ట: ప్రచారంలో మండల నాయకులు



రాయచోటి టౌన్: ప్రచారంలో చైర్మన్ ఫయాజ్ బాషా

రాజంపేట టౌన్ : వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి ఓటర్లు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి విన్నవించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులో శుక్రవారం పోలా ముమ్మరంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో సాగిస్తున్న ప్రజారంజక పాలనను వివరించారు. వెన్నపూసను గెలిపిస్తే వైఎస్సార్‌సీపీ గొంతుకగా యువత, నిరుద్యోగుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి పరిష్కరించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులను కలిసి టీచర్ ఎమ్మెల్సీలో తొలి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి అయిన పి.రామచంద్రారెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు న్యామతుల్లా, తంబా సుబ్రమణ్యం, డొంకా సూరి, పార్టీ వివిధ విభాగాల కన్వీనర్లు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, తోట లక్ష్మినారాయణ, అబ్దుల్ మునాఫ్, ఖాజామొహిద్దీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో ముమ్మర ప్రచారం

సంబేపల్లె : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను గెలించాలని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డిలు మండలంలో ముమ్మర ప్రచారం చేశారు. శుక్రవారం మండలంలోని దేవపట్ల పంచాయతీలోని కార్యాలయాల్లో ప్రచార కార్యక్రమం నిర్వాహించారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు టీడీపీ, బీజేపీకి లేదు

నందలూరు(రాజంపేట) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కును టీడీపీ, బీజేపీ పార్టీలు కోల్పోయాని నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ సూర్యనారాయణ ధ్వజమెత్తారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లె పట్టణ ప్రాంతంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్‌తో కలిసి ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పులి భాస్కరయ్య, ఆల్విన్ కార్మిక మాజీ నేత ఎముక దుర్గయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి రమేష్‌రెడ్డి, ఆకుల చలపతి, పవన్, సాయికుమార్‌రెడ్డి, నామాల శ్రీధర్, తుమ్మాది శివ, నరసింహులు, గంగిరెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటువేసి వేయించి గెలిపించాలని శుక్రవారం మండలంలో ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ముక్కవారిపల్లె గురుకుల పాఠశాల, సంజీవపురం సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పట్టభద్రులను ఎమ్మెల్సీ అభ్యర్థి, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేయాలని పట్టభద్రులను కోరారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చిన్నఓరంపాడు పంచాయతీలో మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పట్టభద్రులను కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటువేయాలని కోరారు. చెన్నరాజుపోడు గ్రామంలో మాజీ సింగల్ విండో అధ్యక్షుడు టంగుటూరు కృష్ణారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీపీరాచపల్లి, చిన్నరాచపల్లి గ్రామాలలో రైల్వేబోర్డు సభ్యులు పంజం భరత్ కుమార్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సభ్యులు అక్కిరెడ్డి మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ జరుగునారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డి చెంగల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, గంగిరెడ్డి, పెంచలయ్య, నరసింహారెడ్డి, దశరథ రామరాజు, ఉపసర్పంచ్ రూపేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్న తరపున తమ్ముడు ప్రచారం

నందలూరు(రాజంపేట) : ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలంటూ వరసకు తమ్ముడు అయిన ప్రతాప్‌రెడ్డి నందలూరులో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి సూచనలతో గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలుకు వెళ్లి ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందాన్ని కలిసి ఓటును అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు సీట్లు వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే!

పెనగలూరు : ఎమ్మెల్సీ ఎన్నికలకు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డిలు శుక్రవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్, సచివాలయ సిబ్బందితో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. రాయలసీమలో పోటీ చేస్తున్న రెండు ఎమ్మెల్సీ సీట్లు వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మండలంలో జెడ్పీ హైస్కూల్‌కు, మోడల్ స్కూల్ అభివృద్ధి కోసం, మంజూరు విషయంలో తాము ఎంతగానో కృషి చేశామన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా రామచంద్రారెడ్డికి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షులు సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి, గానేని సుబ్బానాయుడు, పెనగలూరు సొసైటీ ఉపాధ్యక్షుడు కందల జయరామయ్య, మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ గుండ్లూరు శివ, ఉపాధ్యాయులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట: ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని రాచగుడిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని రాచగుడిపల్లి పంచాయతీ, గొల్లపల్లి, సీతాపురం, రాచపల్లి గ్రామాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాచగుడిపల్లి ఉపసర్పంచ్ వెంకట రమణరాజు, ఒంటిమిట్ట జేసీఎస్ కన్వీనర్ దున్నూతల రఘురాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గురుమోహన్ రాజు, నాయకులు మహబూబ్ బాషా, సీతాపురం పాలెం బాబు, సాహెబ్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో..

రాయచోటి టౌన్ : పట్టుభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా పట్టభద్రులను కోరారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని నాయిబ్‌సాహెబ్ వీధి, పాత పోస్టాఫీస్ వీధి, వీరభద్రస్వామి ఆలయ వీధులలో పట్టుభద్రులను కలసి ఎమ్మెల్సీ అభ్యర్థిని వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. అర్హులైన ఓటర్ల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కౌన్సిలర్లు ఆసీఫ్‌ఖాన్, సాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : సోమవారం జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 13న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలపించాలని శుక్రవారం మండలంలోని చిట్లూరు గ్రామంలో పర్యటించి ఓటర్లను అభ్యర్థించారు. అలానే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ మార్కెట్ చైర్మన్ విశ్వనాథ రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ ఏ.నాగభూషణ్‌రెడ్డి, రామానుజులు, వైస్ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, డైరెక్టర్ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ హరినాథరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శివశంకర్, ఓబులేసు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం మన అందరి బాధ్యత

రామాపురం : చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని రామాపురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. ఈనెల 14న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ అల్బెండజోల్ 400 మిల్లీ గ్రాము మాత్రలు తప్పకుండా మింగించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, స్కూల్ టీచర్లు, రెసిడెన్సియల్ స్కూల్స్ ప్రిన్సిపాలతో సమావేశమై నులిపురుగు మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హైదర్‌వలీ, మండల విద్యాశాఖాధికారి రామకృష్ణుడు, ఆరోగ్య సిబ్బంది, సీహెచ్‌ఓలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎండీఎస్ ద్వారా రైతులకు లాభాలు

రామాపురం : రైతులు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతి ద్వారా నిరంతర పంట అధిక దిగుబడిని లాభాలను పొందవచ్చునని అడ్వైజరీ బోర్డు చైర్మన్ అయోధ్యపురం పెద్దిరెడ్డి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం అడ్వైజరీ బోర్డు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన పలు రకాల విత్తనాలను 20 నుంచి 35 రకాల విత్తనపు కిట్లుగా తయారు చేసి రైతులందరికి అందించడం ద్వారా రైతులు వాటిని వినియోగించుకుని భూమిలో చల్లడంతో 365 రోజులు భూమి పచ్చదనం ఉండటమే కాకుండా ఆదాయాన్ని ఇచ్చే పలు రకాలను పంటలను పండించుకొని రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. అలాగే భూమిలో కర్బన శాతము నత్రజని శాతం పెరిగి నేల సారవంతంగా చేసుకోవచ్చుని తెలిపారు. అగ్రికల్చర్ ఆఫీసర్ నాగమణి మాట్లాడుతూ రైతులందరికి అందుబాటులో ఉచితంగా విత్తనపు కిట్లు అందజేయనున్నట్టు, రైతులు వినియోగించుకొని పీఎండీఎస్ ద్వారా అధిక లాభాన్ని పొందాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మండల మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ, మధుకర్, మండల యాంకర్ సూరం వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విత్తనపు కిట్లను తయారు చేస్తున్న పెద్దిరెడ్డి

పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి

- గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో ఉచిత మొక్కల పంపిణీ
- ఆసక్తిగల వారు ప్రభుత్వ హైస్కూల్ వద్ద సంప్రదించాలంటున్న సంస్థ కో-ఆర్డినేటర్

రాజంపేట టౌన్ : మొక్కల పెంపకంపై ఆసక్తి ఉన్న వారికి ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు ద్వారా ఉచితంగా మొక్కలను పంపిణీ చేయనున్నట్లు ఆ బోర్డు రీజనల్ ఆఫీసర్ ఖాదర్‌వలీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలోని నర్సరీని శుక్రవారం ఖాదర్‌వలీ పరిశీలించారు. ఈసందర్భంగా అన్నమయ్యజిల్లా గ్రీన్‌కోర్ కో-ఆర్డినేటర్ జి.చక్రధర్‌రాజుతో కలిసి ఆయన నర్సరీలోని మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఖాదర్‌వలీ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజంపేటలో మాత్రమే గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో నర్సరీ ఉన్నట్లు తెలిపారు. ఈ నర్సరీలో 20 రకాలకు సంబంధించి దాదాపు 60 వేల మొక్కలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఎవరైనా ఇక్కడి నర్సరీకి వచ్చి మొక్కలను ఉచితంగా పొందవచ్చన్నారు. ఇంటి ఆవరణలో స్థలం ఉంటే పుదీన వంటి మొక్కలను పెంచితే అప్పుడప్పుడు ఇంటి అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం మొక్కల పెంపకం ద్వారా విస్తారంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఎంతో కృషి చేస్తుందని, ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. గ్రీన్‌కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ చక్రధర్‌రాజు మాట్లాడుతూ మొక్కలు అవసరమైన వారు పనిదినాల్లో రాయచోటి మార్గంలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్‌కు వచ్చి తమను సంప్రదిస్తే ఉచితంగా ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలతో పాటు ఎవరైనా సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. నర్సరీలో పుష్కలంగా మొక్కలు అందుబాటులో ఉండటానికి గ్రీన్‌కోర్ విద్యార్థుల సహకారం ఎంతో ఉందని తెలిపారు.

ఘనంగా ముగిసిన పాలేటమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ

చిన్నమండెం : పాలేటమ్మ జాతర శుక్రవారంతో ఘనంగా ముగిసింది. మొక్కుబడులు తీరిన భక్తులు చాందినీబండ్లను ఏర్పాటు చేసి మేళతాళాలు, కోలాటాలు, బ్యాండు మేళాలు, టపాసుల పేలుళ్ల మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అదే విధంగా అమ్మవారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతరకు వచ్చిన భక్తులకు మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. రాయచోటి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో రాయచోటి రూరల్ సీఐ లింగప్ప ఆదేశానుసారం పోలీసులు పటిష్ట బందోబస్తును కల్పించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు

రాయచోటి టౌన్ : ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినమైన శిక్షలు తప్పవని న్యాయవాది టి.ఈశ్వర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సాధికారక సేవా సంస్థ, ఉమెన్స్ సెల్ సంయుక్తంగా యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ర్యాగింగ్ ఒక పెనుభూతం లాంటిదని ర్యాగింగ్ చేసి విద్యార్థుల మనస్సులు, మనోభావాలు దెబ్బతినే విధంగా చేస్తే కనీసం రెండు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష తప్పదని చెప్పారు. అలాగే అలాంటి శిక్షలు పడ్డ వారు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హిదాయతుల్లా, నాగరాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మునియా నాయక్, రెడ్‌రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ వెంకట్రావు, ఉమెన్ సెల్ సమన్వయకర్త శాంతకుమారి, ఇంక్లూజివ్ క్లబ్ సమన్వయకర్త ఫారూక్ బాషా, అధ్యాపకులు కిరణ్, ఇస్మాయిల్, అఫ్సాన పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవంలో ప్రభుత్వ విప్

ఓబులవారిపల్లె : విద్యార్థులందరూ బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం చిన్నఓరంపాడు శ్రీవాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 27వ వార్షికోత్సవ వేడుకలలో కొరముట్ల, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సత్యకుమార్ కొరముట్లకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రత్యేక ఆకర్షణగా జబర్దస్త్ నుంచి మోహన్, బషీర్‌లు నిలిచారు. సర్పంచ్ జయపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, వెంకటసుబ్బారెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, ఎస్‌పీ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

రాయచోటి టౌన్ : ఈనెల 14వ తేదీన జరిగే నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని రాయచోటి మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ఎంఈఓ రమాదేవి కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి విద్యాశాఖాధికారి కార్యాలయంలో అధికారులతో కలసి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన మందు బిళ్లలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలకు మింగించాలని సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ అధికారిణి డాక్టర్ జ్యోతి, ఎంఈఓ రమాదేవి, మున్సిపల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, పాఠశాల యజమానులు, అంగన్‌వాడీ కార్యర్తలు, సచివాయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు



అవగాహన సదస్సులో శంకర్‌రెడ్డి తదితరులు

నందలూరు(రాజంపేట) : పాలిటెక్నిక్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉందని తిరుపతి ఎమ్మెల్యే సోదరుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత భూమన శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నందలూరులోని సెయింట్ జోషఫ్ హైస్కూల్‌లో రాష్ట్ర సాంకేతిక విద్య, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి రూపొందించిన పాలిటెక్నిక్ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్యతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఏపీసీటీఈ మార్గదర్శకాలతో సిలబస్ రూపకల్పన జరిగిందన్నారు. రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు ఎస్.అజీజ్ అహమ్మద్ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, వసతిదీవెన ద్వారా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందన్నారు. అన్ని కళాశాలలో పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇస్తారని, ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పెనగలూరు : జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ జయవేలు మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్‌రెడ్డిలు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవ వేడుక

రాయచోటి : అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టరేట్‌లోని స్పందన మీటింగ్ హాల్ శుక్రవారం డీఆర్‌డీఏ జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డీఆర్‌డీఏ సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు జిల్లా కలెక్టర్, జేసీలను ఘనంగా సత్కరించారు. అనంతరం సిబ్బంది, సమాఖ్య సభ్యులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు శ్రావణి, బ్యూలాలను సత్కరించారు. అలాగే ఆటల పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మైథిలి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జిల్లా నలుమూలల నుండి మహిళా సిబ్బంది, మండల సమాఖ్యల లీడర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మహిళలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్

దోమతెరలను ప్రతి ఒక్కరూ వాడాలి

సిద్దవటం : దోమలు కుట్టకుండా రాత్రి పూట ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలని సిద్దవటం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఐ. సుబ్బరాయుడు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలో శుక్రవారం ఆయన డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డెంగ్యూ జర్వరాలపై, లార్వాపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ సిబ్బందితో గ్రామంలో ఇంటింటా తిరిగి లార్వా సర్వే చేశామన్నారు. మురుగు నీరు నిల్వవున్న ప్రదేశాల్లో నీటిలో లార్వా ఉత్పత్తి గాకుండా అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేశామన్నారు. అంతే గాకుండా ప్రజలు మీ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒక్కసారి తొట్లు, కుండలు శుభ్రం చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లోకేశ్వరి, ఏఎన్‌ఎం లక్షుమ్మ, ఆశ వర్కర్‌లు ఓబులమ్మ, పద్మావతి, భారతి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సుబ్బరాయుడు

భద్రకాళికి భక్తుల రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం రంగురంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో, నిమ్మకాయల హారతులతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. అర్చకుడు శంకరయ్య రాహుకాల పూజల విశిష్టతను వివరించారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో జరిగాయి.



అమ్మవారికి హారతులు పడుతున్న మహిళలు

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలి

వీరబల్లి : రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలని ఏపీఎం, వ్యవసాయ అధికారి ఖాదర్ వలీ, స్వాతీలు కోరారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు లాభసాటి వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన మెళకువలు తెలియజేశారు. ప్రతినెల జరిగే కార్యవర్గ సమావేశంలో వ్యవసాయానికి సంబంధించిన విషయాలను తెలుసుకోవచ్చన్నారు. మండల ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు సుబ్బరామరాజు, రైతు మిత్రలు జనమేజయుడు, వెంకటేష్, ఎఫ్‌పీఓ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖాదర్ వలీ